# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 04-10-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

❖ ఆధ్యాత్మిక బోధనలు అంతర్గత శాంతిని పెంపొందించడంతో పాటు, సమాజంలో సానుకూల మార్పును తీసుకువస్తాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు.

❖ మాదకద్రవ్యాల రహిత భారత్ కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని హోం శాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు.

❖ రక్షణ రంగంలో తయారీ కేంద్రంగా ప్రపంచంలో భారత్ ను నిలిపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.

❖ వచ్చే 5 సంవత్సరాల్లో భారత్‌లో తలసరి ఆదాయం రెట్టింపవుతుందని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ తెలియజేశారు.

========================

ఆధ్యాత్మిక బోధనలు అంతర్గత శాంతిని పెంపొందించడంతో పాటు, సమాజంలో సానుకూల మార్పును తీసుకువస్తాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. రాజస్థాన్‌లోని మౌంట్ అబులో ప్రజాపిత బ్రహ్మా కుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన సమాజం కోసం “ఆధ్యాత్మికత' అనే అంశంపై ఈరోజు జరిగిన గ్లోబల్ సమ్మిట్ లో రాష్ట్రపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, శారీరక, మానసిక, ఆధ్యాత్మిక పరిశుభ్రత ఆరోగ్యవంతమైన జీవితానికి కీలకమని పేర్కొన్నారు.

========================

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రేపు మహారాష్ట్రలో పర్యటిస్తారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం 18వ విడత నిధులను మహారాష్ట్రలోని వాషిమ్‌లో విడుదల చేయనున్నారు. దీని ద్వారా దేశవ్యాప్తంగా 9.4 కోట్ల మంది రైతులు ప్రత్యక్ష ఆర్థిక ప్రయోజనాన్ని పొందనున్నారు. అలాగే వాషిమ్ లోని బంజారా కమ్యూనిటీ వారసత్వాన్ని చాటిచెప్పే బంజారా విరాసత్ మ్యూజియాన్ని ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. అనంతరం సుమారు 23 వేల

300 కోట్ల రూపాయల వ్యవసాయ, పశుసంవర్ధక రంగానికి సంబంధించిన పలు కార్యక్రమాలను ఆయన ప్రారంభిస్తారు. సాయంత్రం థానేలో 32 వేల 800 కోట్ల రూపాయల విలువైన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధానమంత్రి ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేస్తారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

మాదకద్రవ్యాల రహిత భారత్ కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని హోం శాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఉత్తరాదిలో ఇటీవల మాదక ద్రవ్యాలు పట్టుబడిన నేపథ్యంలో హోంమంత్రి స్పందిస్తూ.... ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో యువతను క్రీడలు, విద్య, ఆవిష్కరణల వైపు తీసుకెళ్తున్నారని, మరోవైపు మాదక ద్రవ్యాలు వంటివి యువత భవిష్యత్ ను ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయని అన్నారు. దేశవ్యాప్తంగా మాదక ద్రవ్యాల నెట్‌వర్క్‌ను అరికట్టడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని హోం శాఖ మంత్రి సామాజిక మాధ్యమం వేదికగ స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

రక్షణ రంగంలో తయారీ కేంద్రంగా ప్రపంచంలో భారత్ ను నిలిపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఈరోజు న్యూఢిల్లీలో సొసైటీ ఆఫ్ ఇండియన్ డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరర్స్ (SIDM) 7వ వార్షిక సర్వసభ్య సమావేశంలో రక్షణ మంత్రి మాట్లాడుతూ... 2023-24 సంవత్సరంలో దేశీయ రక్షణ ఉత్పత్తి రికార్డు స్థాయిలో 1 లక్షా 27 వేల కోట్ల రూపాయలను అధిగమించిందని అన్నారు. కృత్రిమ మేదస్సు, సైబర్ డిఫెన్స్, అటానమస్ సిస్టమ్స్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంపై పెట్టుబడులు పెంపొందించాలని మంత్రి పిలుపునిస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

తిరుమలలో శ్రీవెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈరోజు నుంచి ప్రారంభమైయ్యాయి. కొద్ది సేపటి క్రితం తిరుమల శ్రీవారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీ సమేతంగా వెళ్ళి పట్టు వస్త్రాలు సమర్పించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్మాణాత్మక చర్యలతో సామాన్య మానవుల జీవన ప్రమాణాల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఢిల్లీలో నిర్వహించిన కౌటిల్య ఎకనామిక్ సదస్సుల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి మాట్లాడుతూ... వచ్చే 5 సంవత్సరాల్లో భారత్‌లో తలసరి ఆదాయం రెట్టింపవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలో అసమానతలు తగ్గడంతో పాటు గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ ఆలోచనలతో అభివృద్ధి చెందిన దేశంగా భారత్ నిలుస్తుందని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 36 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

సమాజంలోని వెనుకబడిన వర్గాల హక్కుల పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు తెలిపారు. ఈరోజు ఆయన నాగ్‌పూర్‌లో పాత్రికేయులతో మాట్లాడుతూ...

రానున్న పార్లమెంటు శీతాకాల సమావేశాలలో వక్ఫ్ సవరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించి ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూములను పరిరక్షిస్తామని ఆయన వివరిస్తూ...

(వాయిస్ 26 సెకన్ల)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో కిల్కారీ, మొబైల్ అకాడమీ కార్యకలాపాలను అమలు పరిచేందుకు న్యూఢిల్లీలో భారత ప్రభుత్వం, అర్మాన్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈరోజు జాతీయ కార్యశాలను నిర్వహించారు. ఈ రెండు వినూత్న కార్యక్రమాలు ఐవీఆర్ టెక్నాలజీని ఉపయోగించుకుని బాలింతలకు, ఆరోగ్య కార్యకర్తలకు కీలక సమాచారం అందిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని 90 శాతం ASHA కార్యర్తలు మొబైల్ అకాడమీ కోర్సును 18 నెలల్లో పూర్తి చేశారని, డిసెంబర్ 2024 నాటికి నూరు శాతం లక్ష్యంగా పెట్టుకున్నామని ఆంధ్రప్రదేశ్ మాతా శిశు సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు డాక్టర్ కె.వి.ఎన్.ఎస్. అనిల్ కుమార్ తెలియజేశారు. ఆరోగ్య కార్యకర్తలు క్షేత్ర స్థాయిలో విస్తృత ప్రచారం కల్పించడంతో పాటు ఉత్తమ విధానాలు అవలంబించడం ద్వారా కిల్కారీ & మొబైల్ అకాడమీ కార్యకలాపాలు మాతా శిశు సంరక్షణలో మెరుగైన ఫలితాలు రాబట్టడానికి దోహదపడ్డాయని ఆయన వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

లెబనాన్, ఇరాన్, ఇజ్రాయెల్‌లో ఉన్న భారతీయులు జాగ్రత్తగా ఉండాలని భారత విదేశాంగ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేస్తూ.. మూడు దేశాల్లోని తమ పౌరుల క్షేమ సమాచారం కోసం అక్కడి భారత రాయబారులతో మాట్లాడి నిరంతరం వివరాలను తెలుసుకుంటున్నట్లు పేర్కొంది. కాగా బీరుట్‌లో జరిపిన దాడుల్లో హిజ్బుల్లా సంస్థకు ఆయుధాల సరఫరా, నిధుల సమీకరణ వ్యవహారాలను పర్యవేక్షించే హసన్ జాఫర్ అల్-ఖాసిర్ మృతి చెందారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

పెరూలోని లిమా వేదికగా జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో పురుషుల విభాగంలో భారత్ త్రయం స్వర్ణం గెలుచుకుంది. ముకేశ్ నేలవల్లి, రాజ్‌వర్ధన్, హర్సిమర్ సింగ్ రత్తా 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ విభాగంలో బంగారు పతకం గెలుచుకున్నరు. దీంతో పతకాల పట్టికలో భారత్ అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఇప్పటివరకు సాధించిన 16 పతకాలలో 11 బంగారు, 1 రజత, నాలుగు కాంస్య పతకాలు ఉన్నాయి. అంతకుముందు.. భారత క్రీడాకారిణి ఖుషి కాంస్యం సొంతం చేసుకుంది. మహిళల 50 మీటర్ల రైఫిల్ విభాగంలో ఖుషి మూడో స్థానంలో నిలిచింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

టీ-20 ప్రపంచకప్‌లో భారత మహిళల క్రికెట్ జట్టు.. షార్జాలో న్యూజిలాండ్ తో తలపడతుంది. ఈ రెండు జట్ల మధ్యే తొలి మ్యాచ్ జరగనున్న నేపథ్యంలో ఇందులో గెలిచే జట్టుకే సెమీస్ అవకాశాలు మెరుగ్గా ఉండే అవకాశముంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్లు సూచీలు ఈరోజు నష్టాలతో ముగిశాయి. ఉదయం నష్టాలతో ప్రారంభమైన సూచీలు వరసగా ఐదో రోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 82 వేల 244.25 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై 81 వేల 688 వద్ద ముగిసింది. నిఫ్టీ 200.25 పాయింట్ల నష్టంతో 25 వేల 049.85 వద్ద స్థిరపడింది. ఇరాన్- ఇజ్రాయెల్ యుద్ధ భయంతో చమురు ధరలు ఒక్కసారిగా పెరగడం, విదేశీ మదుపర్ల సంపద తరలిపోవడం వంటివి సూచీల పతనానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = =